# సముద్ర స్నానం

అవటానికి ఆషాఢ పూర్ణిమ ఆనాడు. మొన్న పూర్ణిమేనండీ! రాత్రి పదిగంటలు అవుతుంది. చదివీ చదివీ పుస్తకాలంటే విసుగొచ్చింది. తప్పేదేముందీ? ఇంకో సిగరెట్టు! వహవ్వా....సిగరెట్టు ఆఖరి పీల్పులు మరీ—కమ్మగా వేచిన జీడిపప్పు వాటంగా ఉన్నాయంటే నమ్మండి!

"ఓయీ సుధాకరా! నిలువు మొక్క నిమేషము, నీ మహోదయ ...." వేదుల సత్యనారాయణశాస్త్రిగారి పద్యాలు. అబ్బో! దీపాలుపెట్టి నప్పటినుంచీ చదివి చదివి విసుగొచ్చింది. ఆయన పద్యాల్లో కనరులేక పోయినప్పటికీ మా చదువులో లేదూ కనరు? ఇంతలో ఎక్కణ్ణుంచి వొచ్చారో—ఆచారీ—సూరీ!

సూరి ఉత్థ నానుడు మనిషి—చేసేపని చలితేలల్లే చేస్తాడు—ఆచార్లు అవాయిచువ్వ! ఔటు! భూకంపం! ఉద్దండప్పిడుగు!! వీళ్ళిద్దరికీ తైనాతి గోపాలంగారు,

గోపాలంగారు కూనిరాగాల స్పెషలిస్టు. ఆయనకు రామనాధశాస్త్రి ప్లేట్ల పాటలన్నీ సరిక్షు తప్పులతో సహా కంఠతఃపచ్చు, శేషగిరిరావు ముసిలిదాని సాధింపు సంగతులూ వొచ్చు. సుబ్బారావు ఎక్కిళ్ళపాటా వొచ్చు!....ఇప్పుడిప్పుడు సిగరెట్టిష్టు కూడాను. సూరి నా పక్కని కూచ్చుని ఆప్యాయంగా.... "ఏలనోగాని మిమ్ము వీక్షించినంత ప్రాణములు లేచి వచ్చిన పగిదితోచు" అంటూ పద్యం పూర్తిచేస్తున్నాడు.... ఆచార్లు జేబులు తడివి చూసి పెదవివిరచి షెల్ఫు పూర్తిచేస్తున్నాడు.... గోపాలంగారు 'రాఘవా' అన్నముక్కని ఎవరెస్టు శిఖరం మీదకు ఎగరేసి, అక్కడ దాంతో చెడుగుడు ఆడి, దాన్ని దూది పింజలల్లే ఏకి, అమాంతం కిందకు తోసి, దాన్లో పట్టుకుని, మాడుమీద ఓ దెబ్బకొట్టి, రెండు కాఫీ వడపోతలు పోసి, గుర్రున బల్లమీద పెట్టినట్లు మంద్రంలో ఆపి 'ముద్దీయరా' ఎత్తుకుని సిగరెట్టుసార్! అన్నాడు.

"సిగరెట్లురా" అని ఆచార్లూ అడిగాడు.

"ఇవ్వటానికి వీల్లేదు."

"వీల్లేకపోవటమేమిటీ....? నీ నెత్తీ నీ మొహమున్నూ"

"ఇవ్వనంటూంటే."

అప్పుడే సూరి సిగరెట్లు తియ్యనూ తీశాడు. ఆ యిద్దరికీ చెరోటీ యిచ్చి తాను "క్రతూత్సవ సంధాయక నన్నుగావదగవే స్వాహావధూ వల్లభా!" అంటున్నాడు....

"అబ్బ! పూర్ణిమనాడు కూడా....చదువేనా? షికారుపోకా?"

"సఙ్."

"సఙ్."

## 2

రోడ్డుమీద తువ్వాలాలు పఱుచుకు పడుకున్నాం. ఓహో పద్యాలకి పద్యాలు, శ్లోకాలకి శ్లోకాలు గిరగిరా తిరిగిపోతున్నై.... కబుర్లకి కబుర్లు కిలకిల మనిపించి దోబూచులాడుతూన్నై.

సముద్రానికి పోయేబళ్ళు పోతున్నై! వెంటనే ధోరణి మాలో మారిపోయింది....

ఓ బండిలో.... అనాఘ్రాతం పుష్పం అనలేం కానీ— అఖండం పుణ్యానాం ఫలం అనగలం. ఓ పడుచు సముద్రస్నానానికి పోతోంది. సూరి ఏమనుకున్నాడో ఏమిటో— "తచ్చేతసాస్మరతి నూన మబోధ పూర్వం.... భావస్థిరాణి జననాంతర సౌహృదాణి...." కొయ్యబారి పోయాడు.

ఆచార్లు ఏమిటో— ఆకాశంకేసి చూసి నా భుజం తట్టి 'సముద్రానికి వెళదాం లే'— అంటూ తోచకుండా ఓహ్ మొదలెట్టాడు.

సరేనంటే సరే— అన్నాం. గోపాలంగారు రాగప్రపంచాన్ని ఖూనీ చేస్తున్నాడు— సూరిని.... యోగనిద్రలోంచి కదిపి వొస్తావు టోయ్— అంటే—నేను రానని లోపలికి వెళ్ళి పడుకున్నాడు.

మంగళగిరి రథాన్ని కదిలించినంత పనైంది. తాము మీద కూర్చున్న వెంకటాచార్లు సరే వస్తానన్నాడు. పోనీ ఎందుకైనా ఉపయోగిస్తాడు, గుడ్డల మూటైనా తీసుకొస్తాడు గదా అనుకుని వొప్పుకున్నాం.

పర్ణశాలలోకివచ్చి ఎవరిబట్టలు వారు తీసుకుని, పెట్టెలు సర్ది డబ్బు కోసం దేవుళ్ళాడుతుంటే, వెంకటాచార్యులు లబోదిబో. ఆయన పెట్టెలో అంతక్రితమే భోజనాల ముందు దాచిన రెండురూపాయలపై చిల్కా— ఎవడో నస్మరంతిగాను గుటకాయస్వాహా చేశాట్ట.... చిన్న బేడకాసల్లే. ఇస్పేటాసులల్లే మొహం చేసుకుని మాదగ్గరకు వచ్చి నేనురానని ఆ పెట్టె దిండుగా చేసుకుని ఆలోచిస్తున్నాడు పాపం గుంటడు!! సూరి తప్ప మిగతా మేమంతా సిద్ధమేగా!

సూరిని కదిలించాలి. రానంటాడు. ఏమీ పాలుపోదు. ఇంతటితో అధైర్యం తెచ్చుకుని మా ప్రయాణం మానేస్తే, మరి మా ఆంధ్రత్వం ఏమైపోవాలి! నిద్ర నటిస్తూ యోగనిద్రలోవున్న సూరిని కాళ్ళదగ్గర ఆచార్లూ, తల దగ్గర నేనూ, నడుం గోపాలంగారూ పట్టుకుని గోవిందాలు కొడుతూ ఓ ఫర్లాంగుమోశాం. దింపండోయి అంటూ అరుస్తాడు— సూరి. దింపితే—ఎక్కడ తుర్రుమంటాడో అని మాకు. రెండు మూడు ఫర్లాంగులు మోసి కిందకు దింపాం పంధొమ్మిదేండ్ల బాలకుమారుణ్ణి. ప్రయాణం సాగుతోంది....నా సిగరెట్ కేసులో 12 సిగరెట్లు ఉన్నై.... సూరి దగ్గర 10 ఉన్నై. గోపాలంగారు యివికాక యింకో రెండు పెట్టెలు తెస్తున్నాడు. ముందు చాలులే—అంటే చాలులే అనుకుని ప్రయాణం చేశాం. దారిలోచూస్తే—గోపాలంగారి రెండు పెట్టెలూతప్ప మిగిలిన వన్నీ భస్మమైనాయి. ఓ రామరావణయుద్ధము చేశాడు ఆచార్లు సమిధల కోసం. పోట్లాట పర్యవసానం నా సిగరెట్ కేసూ, సూరి సిగరెట్ కేసూ, నాలుగుముక్కలై కింద పడివున్నవి.

చేసేదిలేక వాటినే క్రేటే గా ఉపయోగపరుచుకుందామనుకున్నాం.

ఇంకా బందరు అయిదుమైళ్ళుంది. అసలు ఉద్దేశ్యం ఏమిటంటే బందరువెళ్ళి శరీరసత్తువా సైమూ చూసుకుని వీలుంటే....ఎకాఎకిని సముద్రానికి పోదామని....సూరి మాత్రం సముద్రందాకా వచ్చినా స్నానం మాత్రం చేయనని పట్టు. వైద్యసిద్ధాంతాలు చెప్పిచూశాం.... మతపిచ్చ బోధపరిచాం. హుషారు కైపు ఎక్కించి చూశాం...ఏమైతేనేం. తాను పట్టినపట్టు వొదిత్తే మళ్ళీ మనిషి రోలీకైనా మారతాడా?

నెమ్మదిగా గోపాలంగారి పాటలకూ, ఆచార్లుగారి హాస్యానికీ ఆనందిస్తూ సూరిగారిని గేలిచేస్తూ....దేశంలో ఉంటున్న హేమాహేమీ లని....అల్లాటప్పాలిస్టులో జమకట్టుతూ.... కొన్ని పత్రికల్ని తెగ మెచ్చుకుంటూ, కొన్నిపత్రికలను వంశ నాశనంచేస్తూ........ఆర్టుమీద లెక్చర్లు పేలుతూ .... సెటైర్లూ సూటీపోటీలు విసురుతూ....కర్రల వంతెన....దగ్గరికి దేవుడిదయవల్ల వొచ్చిచేరుకున్నాం. అసలే పూర్ణిమ అవడంవల్ల కొద్దోగొప్పో మంచు మామీద కురుస్తోంది....కంఠాలు బిగుసుకు పోయాయి. మా సంగీత విద్వాంసుడు కంఠం పూరించలేదుస్మండీ. నడిచినడిచి ఉన్నామేమో నడుములూ....పిక్కలూ ఓ పీక్కు పోతున్నవి. తువ్వాలాలుపరిచి భూదేవికి సాష్టాంగ ప్రణామంచేసి.... అమ్మయ్య అనుకున్నాం ఒహరి నడుం యింకోరికి తలగడ........

## 3

సూరి ఉన్నట్టేఉండి లేచికూర్చుని మళ్ళీ నడుద్దామంటాడు....ఈమాట విన్నకొద్దీ ఆచార్లు గురకలు తీస్తున్నాడు........"ఏంరా గోపాలం" అన్నాను. "ఒక్కఘంటైనా కచ్చితంగా పడకవెయ్యాలిసిందే" అన్నాడు,

....పక్కని కాలువ....పైన పూర్ణిమ చంద్రుడు. రెండుపక్కలా మంచి వున్నతములైన వృక్షములు. నిద్రపోవటానికి యింతకంటే మంచి ప్రదేశము కావాలే? అలిసిఉన్నామేమో మంచినిద్ర పడుతోంది....ఈ తోకపీకుడుగాడు లేద్దాంలే—అంటాడు....లేడికి లేచిందే ప్రయాణం.... జోరున వానకురుస్తున్నా.... ప్రయాణం చెయ్యకపోతే ........ మన ఆంధ్రత్వం యేంవుందీ....అయినింటివాళ్ళం. మనం యువకుల మను కోవటం ఏం సబబూ....అని సూరి ఒకటే గోల....

వీపుల మీద తట్టి చూశాడు....'చెవుల్లో కు క్కు రో కోయి' అని కోడికూత కూశాడు. నెత్తిమీద చిటికలు వేసి చూశాడు. మన్ను తెచ్చి వీపుమీద పోశాడు!....ఏమైతే నేం....అతని తృప్తి కుదరలేదు....పక్క నున్న కాలవ నీళ్ళు ఓ దోసిడు తీసుకునివచ్చి....అందరి చెవుల్లోనూ పోసి చూస్తున్నాడు....వీడు లేకపోతే హుషారేమిటి అనిపించింది....విధి లేక నడుములు విరిగిన పాములల్లే లేచి కూర్చున్నాం. సమిధా దహనం చేసి ఆచార్లుగారు పాటలంకించుకున్నారు. గతిలేక నడుస్తున్నాం వేళా కోళానికి ఆచార్లు తిష్టవేశాడు ..ఓటా వ్వడవ తిట్లూ ఓ విమానం సూటీ పోటీ మాటలూ ఓ స్టీమరు ఆత్మ నిందలూ ఉపయోగించి అల్లాగయితే నేను వెళ్ళిపోతా నంటూ సూరి వెనక్కు మళ్ళాడు.పదిగజాలు పోనిచ్చి, గావుకేక వోటి విసిరి మళ్ళీ నడక పుచ్చుకున్నాం. దేవుడి దయ వల్లా వాడి ఉదారమైన బుద్ధివల్లా వొచ్చి మాలో కలుసుకున్నాడు! ఇదే పద్ధతిగా బందరు చేరుకున్నాం.

బందరు చేరేటప్పటికి మా అస్త్ర శాస్త్రాలూ ఉడిగినవి....కోపం పట్టలేక సూరి....ఎకాఎకిని సముద్రానికి పోదామా అంటే....అరిచి చచ్చినా ఇక్కణ్ణుంచి అడుగు పెట్టను అన్నాడు....బట్టల కొట్ల అరు గులమీద ఆ చలిలో ఆ నాపరాళ్ళ మీద ముట్టుది పడుకున్నట్లుగా పడు కున్నాం....నిద్రా చిరేణ నయనాభిముఖీ బభూవ.

పడుకోబోయే టప్పుడు ఓ గంట పడుకుని....తరువాత సముద్రానికి పోదామనే కానీండీ....ఈశ్వరేచ్ఛ యింకో విధంగా ఉంటే అదెల్లా జరుగుతుంది....

కోళ్ళు కూసేటప్పుడైతే సూరికి మెళకువ వచ్చిందిట కానీండీ.... అసలు మొదటనుంచీ దురుద్దేశ్యంతో ఉన్నాడు కాదండీ....మళ్ళీ కళ్ళు మూసుకుని నిద్ర పట్టించు కున్నాట్ట! పోనీ అల్లరికైనా మమ్మల్ని లేపలేదు. అటువంటి పిచ్చిపనులు చేస్తాట్టండీ....ఆంధ్ర రక్తం పొంగి ప్రవాహాలు కట్టుతూన్న కుర్రవాడు! మేమంతా మత్తులో పడి ఉన్నాము....! సూర్యుడు కరకరా ఉదయిస్తూంటే మెళకువ వచ్చింది అందరికీని—వొళ్ళు విరిచి ఆవలించి శివ శివా అని సముద్రమునకు వెళదామ్రా అబ్బాయీ అని అడిగాను....ఆఁ....ఇప్పుడేమిట్రా సముద్రం అన్నాడు ఉభయ వేదాంత ప్రవర్తకుడు! అయినా హుషారు ఇగిరిపోలేదు కనక....జట్కా బళ్ళ వాళ్ళని పిలిచి అడిగాం. ఇసుక దిబ్బల కాడికి రెండు రూపాయీలు అడిగారు. కాళ్ళు చల్ల పడ్డాయి.... ఆనంద భవనంలోకిపోయి వేపపుల్లలు పుచ్చుకుని....కొంచెంపైకి పోయి శ్రీరామ లింగేశ్వరస్వామి గుడిదగ్గర మొఖాలు కడుక్కున్నాం....మళ్ళీ ఆనంద భవన్లోకి వొచ్చి............ "ఛోటా హజ్రీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ, కాఫీపానం కరిష్యామి సిద్ధిర్భ వతుమేసదా........" అనుకుంటూ ముందు ఆత్మారాముడికి కైంకర్యం చేయించాము.

## 4

తెచ్చిన డబ్బుల్లో సగం కాఫీహోటల్ వాళ్ళే వడ్డీతో గుంజుకున్నారు....

మళ్ళీ పర్ణశాల చేరుకోవాలి. ఇహ నడిచే ఎత్తులోలేం! పైగా పైన మబ్బు పట్టుకొస్తోంది. నడిచిపోవటం దుర్ఘటం! తరుణ ప్రయాణి

అయిన మోటారు కాడులో దేహాల్ని చేర్చుకుని....ఫ్రెంట్ సీటులో మహా దర్జాగా కూర్చున్నాడు సూరి....సరిఘ్గా ఆయన వెనకాల ఆచార్లూ ఆ వెనుక నేనూ... నా వెనుక గోపాలంగారూ కారు నడుస్తోంది. ఎప్పుడు ముడిపెట్టాడో మహానుభావుడు ఆచార్యులవారు ` నడుం అన్చుకునే అడ్డ కడ్డీకి సూరి ఉత్తరీయాన్ని! అల్లరి మహా యజ్ఞానికి నూరుగురు వానరాధ్వర్యుల పెట్టు ఆచార్యుల వారంటేనూ....ఏదో కాస్తో కూస్తో....శ్రీవారి శిష్యుణ్ణి అనుకోండీ....వాన దంచుకుంటోంది....నేను మాత్రం ఊరుకోలా చెప్పొద్దూ... ఆచార్యులవారి ఉత్తరీయ్యాన్ని.... పూర్వత్గా చేశాను. ఎప్పుడు....కృత హస్తుడయ్యాడో గోపాలంగారు నా ఉత్తరీయ్యాన్ని కాస్తా ముడిపెట్టేశారు!—

పర్ణశాల దగ్గరకు కారు వొచ్చి ఆగింది. వాన మరీ ఎక్కువగా కురుస్తోంది. అదేం మాయో సూరి మెడలో ఉన్న ఉత్తరీయం ఉరిత్రాడ యిందేం... ! సూరి నానా అవస్థ పడుతుంటే ఆచార్లు వికృతాట్టహాసం చేశాడు!........ఆచార్యులగారు బాధపడుతుంటే నేనూ గోపాలంగారూ నవ్వాము అనుకోండీ....దాంట్లో అబ్బే! తగూ ఎముందీ? దిగండయ్యో ........పెందరాళే—మీ అల్లర్లూ మీరూ అంటూ ఓ మూల కారువాడు గోల....ఓ వక్కని వాన దం చేస్తోంది....ఓ వక్క యీ ఓబయ్యాలు నవ్వు లంకించుకున్నారు. మెళ్ళో ఉన్న ఉత్తరీయం ఊడి రాదేం? శివ ....శివా....ఛస్తే మళ్ళీ సముద్రస్నానాని కంటూ బయలు దేరుతామా ఈ జన్మకి? అందులో వానలు కురిసే ఆషాఢ పూర్ణిమకు........బాబూ అసలు సంగతి చెప్ప మరిచాను ఆ బండిలోపోయి మమ్మల్ని కదిపి యింత తంతూ జరిపించిన అమ్మాయి మా కళ్ళ పడితేనా....?